బెల్లంపల్లి ఏరియా దవాఖానలో షార్ట్ సర్క్యూట్

- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఏసీ

పూర్తిగా కాలిపోయిన పై కప్పు

బెల్లంపల్లి, నవంబర్ 14 : బెల్లంపల్లి ఏరియా దవాఖానలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమై మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గురువారం ఉదయం దవాఖానలోని వైద్యుల విశ్రాంతి గదిని శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బంది వెళ్లి ఏసీని ఆన్ చేశారు. ఒక్కసారిగా ఏసీ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పైన ఉన్న సీలింగ్‌కు, థర్మకోల్ షీట్లకు అంటుకున్నాయి. అక్కడి సిబ్బంది వాటిపై నీరు పోయడానికి ప్రయత్నిస్తుండగా వెంటనే అప్రమత్తమైన దవాఖాన సూపరింటెండెంట్ మధుకుమార్ ఆ గదికి ఉన్న మెయిన్‌తో పాటు దవాఖాన మెయిన్‌ను ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తిప్పింది. ఆపై అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 1986లో దవాఖానను ప్రారంభించగా, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతోనే తాజాగా రెండుసార్లు షార్ట్ సర్క్యూట్ టి జరిగినట్లు తెలుస్తోంది. పెద్ద ప్రమాదం జరగకముందే సింగరేణి యాజమాన్యం స్పందించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే సింగరేణి ఏరియా దవాఖానాలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సింగరేణి ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ నాయకులు మణిరామ్‌సింగ్, అంబాల మహేందర్, చాంద్‌పాషా, రాజబాబు, నీరటి రాజన్న, గోగర్ల శంకర్ ఆరోపించారు. గురువారం వారు మాట్లాడుతూ బెల్లంపల్లి రీజియన్‌కే తల మానికంగా ఉన్న దవాఖానను వార్డులు కుదింపు, ఇతర సదుపాయాలను ఎత్తివేసి యాజమాన్యం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పురాతన దవాఖాన కావడం, కాలం చెల్లిన విద్యుత్ వైరింగ్ లోపాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

దండేపల్లి,నవంబర్ 14: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుండాలని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. దండేపల్లి మండలంలోని మేదరిపేటలో నేషనల్ డయాబెటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 200 మందికి ఉచిత షుగర్, బీపీ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదంశెట్టి మల్లికార్జున్, కొండు జనార్ధన్, బొలిశెట్టి రాజన్న, కర్ని నరేందర్, గడ్డం రాంచందర్, సత్యం, బూసిరాజు రాజన్న, శ్రావణ్, సత్యనారాయణ, కుంచె కిషన్, సుగుణాకర్, సత్తయ్య, గంగారాం ఉన్నారు.

చట్టాలపై షీటీం అవగాహన

శ్రీరాంపూర్, నవంబర్ 14 : శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి మహిళలకు గురువారం సేవా సమితి కార్యాలయంలో షీ టీం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ హైమా పాల్గొని మహిళలకు వారి హక్కులు, చట్టాలు వివరించారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా షీ టీం సభ్యులు సతీశ్, జ్యోతి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సస్పెన్షన్

హెచ్ఎం శ్రీనివాస్

వాంకిడి,నవంబర్ 14: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్‌ను గురువారం సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 30న ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్‌తో 60 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చేరిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విచారణ జరిపి నివేదించగా, గురువారం హెచ్ఎంను సస్పెన్షన్ చేస్తూ పీవో ఉత్తర్వులు జారీ చేశారు.

'కార్తీక' సందడి...

మంచిర్యాల మార్కెట్‌లో ఉసిరి కాయలు కొంటున్న మహిళలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 14: మంచిర్యాల మార్కెట్‌లో గురువారం కార్తీక పౌర్ణమి సందడి కనిపించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తరలి వచ్చి పూజకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఉసిరిక కొమ్మలు, దీపపు ప్రమిదలు, వత్తులు, తులసి కోటలు, మొక్కలను కొనుగోలు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.